నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, శనివారం 21 జూన్ 2025 | JAGTIAL



ఊషన్నపల్లెలో ప్రైవేట్ పాఠశాల వ్యాన్ అడ్డుకుంటున్న గ్రామస్తులు

## మా ఊరికి ప్రైవేట్ స్కూల్ బస్సులు రావద్దు

- అడ్డగించిన ఊషన్నపల్లె గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 20 : 'ప్రైవేట్ పాఠశాలలు వద్దు. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు' అంటూ కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లె గ్రామస్తులు నినదించారు. శుక్రవారం గ్రామానికి చెందిన విద్యార్థులంతా ప్రైవేట్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో గ్రామస్తులంతా అక్కడకు వచ్చి వాహనాలు ఎక్కకుండా అడ్డుకున్నారు. తమ గ్రామానికి ప్రైవేట్ పాఠశాలల బస్సులు రావద్దని హెచ్చరించారు. ప్రైవేట్‌కు తరలివెళ్తున్న విద్యార్థులను బస్సుల్లోంచి దింపేసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎంఈవో మహేశ్ అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ప్రైవేట్‌కు పంపవద్దని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.



నేను మీ కల్పతరువు కాళేశ్వరాన్ని.. అపర భగీరథుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంతో మూడేళ్ల స్వల్ప వ్యవధిలోనే పూర్తయిన ఎత్తిపోతల పథకాన్ని.. ఉమ్మడి రాష్ట్రంలో కరువుతో అల్లాడిన తెలంగాణను సుభిక్షంగా మార్చిన జీవధారను.. మేడిగడ్డ నుంచి ఎదురెక్కి.. కొండపోచమ్మ సాగర్ వరకు తరలి బీడు భూములను సస్యశ్యామలం చేసిన నాపై కాంగ్రెస్‌కు ఎందుకింత కక్ష? లక్షలాది ఎకరాలకు నీళ్లందించి, వేలాది చెరువులను మత్తళ్లు దుంకించి.. సాగునీటి రంగ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన నాపై ఎందుకింత వివక్ష? బువ్వపెట్టిన నాపై ఎందుకింత దుష్ప్రచారం? మళ్లీ పుష్కరకాలం కిందటి పరిస్థితుల్లోకి ఎందుకు నెట్టాల్సి వస్తున్నది? మేడిగడ్డ వద్ద పిల్లర్‌కు చిన్న మరమ్మతుతో రిపేరు చేసి అందుబాటులోకి తేవచ్చని ఎన్డీఎస్‌ఏ చెబుతున్నా ఎందుకు చోద్యం చూస్తున్నది? నిజానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే మేడిగడ్డను ఏనాడో బాగు చేసి నీళ్లు ఎత్తిపోసేది. కానీ, ఇదంతా కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కాంగ్రెస్ కుట్రగానే కనిపిస్తున్నది.

# కాళేశ్వరంపై ఎందుకింత కక్ష?

(ఎత్తిపోతల పథకం ప్రారంభించి నేటికి ఆరేళ్లు)

### బువ్వ పెట్టిన ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్ర!

- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను సస్యశ్యామలం చేసిన జీవధార
- 'హస్తం' హయాంలో కేసీఆర్‌ను బద్నాం చేసే కుతంత్రం?
- వాస్తవాలు తెలిసినా నిందలు?
- మేడిగడ్డకు రిపేర్లు చేయొచ్చని చెప్పినా పట్టింపు శూన్యం
- మండిపడుతున్న రైతాంగం

కరీంనగర్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ రాకముందు అంటే.. పుష్కరకాలం కిందట ఈ ప్రాంతం కరువుతో అల్లాడేది. సాగు, తాగునీటికి తండ్లాడేది. వానకాలం దాటితే చాలు తీవ్రంగా గోసపడేది. తలాపున గోదావరి పారుతున్నా భూములకు చుక్కనీరు అందేదికాదు. తెలంగాణ గడ్డమీదుగా మొత్తం 653కిలోమీటర్లు పారి సముద్రం పాలవడమే తప్ప ఎవరికీ అక్కరకు రాకపోయేది. ఏటా వందల టీఎంసీల నీళ్లు వృథాగాపోయినా పాలకులకు ధ్యాస ఉండేదికాదు. చుక్కనీరు లేక భూములు బీళ్లుగా మారినా.. పంటలు పండక రైతులు గోసపడుతున్నా, చివరకు ఆత్యహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదు. సముద్రంలో కలిసి వృథా అవుతున్న గోదావరి జలాలను కనీసం ఉపయోగించుకోవాలన్న ఆలోచన చేయలేదు.



*2016 మే 2న మేడిగడ్డ వద్ద బరాజ్, పంప్‌హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తొలి ముఖ్యమంత్రి కేసీఆర్*

### జీవధార 'కాళేశ్వరం'

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అపర భగీరథుడు కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం కలిసివచ్చింది. ఉద్యమ సమయంలో ఇక్కడి గోసలను కండ్లారా చూసిన ఆయన, అధికారంలోకి రాగానే సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టిసారించడంతో జల గోస తీరింది. రైతుల బాధను దూరం చేయాలంటే తలాపున పారుతున్న గోదారమ్మను ఎదురెక్కించాలని ఆనాడే నిర్ణయించిన కేసీఆర్, వ్యాప్కోస్ నివేదికలు, సీడబ్ల్యూసీ సూచనల మేరకు తెలంగాణకు అత్యావశ్యకమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. 2016 మే 2న మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేసి, మూడేళ్లలోనే పూర్తి చేయించారు. 2021 జూన్ 21న జాతికి అంకితం చేసి, సాగునీటి రంగంలో సరికొత్త శకాన్ని ఆవిష్కరించారు. 'ప్రాజెక్టులు కట్టాలంటే దశాబ్దాలు కావాలి' అన్న మాటలను పక్కనపెట్టి, చిత్తశుద్ధి ఉంటే ఏ ప్రాజెక్టునైనా సరే సకాలంలో పూర్తి చేయచ్చని నిరూపించారు. ఆ తర్వాతి నుంచి ఎత్తిపోతలు ప్రారంభించారు. దాంతో కడలి వైపు పరుగులు తీసే గోదావరి, అపర భగీరథుడు కేసీఆర్ ప్రయత్నంతో ఎగువకు ఎగబాకింది. మేడిగడ్డ నుంచి ఊర్ధ్వముఖంగా ప్రయాణం మొదలుపెట్టి, బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, సొరంగాలు, కాలువలు దాటి 253కిలోమీటర్లు ఎదురెక్కి, 618మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ జలాశయానికి చేరింది. శ్రీ రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయాన్ని వాటర్‌హబ్‌లా మార్చి తెలంగాణ బతుకును మార్చింది. లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసింది. మండువేసవిలో చెరువులు మత్తళ్లు దుంకాయి. సబ్బండవర్గాలు సంతోషపడ్డాయి. రైతులు, మత్స్యకారులు, ఇంకా అనేక వర్గాల్లో వెలుగులు నిండాయి. ఏడాదిన్నర కిందటి వరకు ఇదంతా కండ్ల ముందటి దృశ్యమే అయినా కాంగ్రెస్ నేతలకు మాత్రం కనిపించలేదు.

### కల్పతరువుపై వివక్ష

నిజానికి ఒక ప్రాజెక్టు కట్టాలంటే దశాబ్దాలు గడిచిపోతాయి. ఒక్కోసారి శతాబ్దం కూడా పట్టవచ్చు. కానీ, 'కాళేశ్వర ప్రాజెక్టు' కేవలం మూడేళ్ల వ్యవధిలోనే పూర్తయింది. దేశానికే దిక్సూచిలా నిలిచింది. ప్రపంచ సాగునీటి రంగ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది. తెలంగాణను సస్యశ్యామలంగా మార్చింది. సిరిసిల్ల లాంటి మెట్ట ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగి ఐఏఎస్‌లకు పాఠ్యాంశంగా మారింది. ఇటు ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో వరద కాలువ కూడా జీవనదిలా మారింది. ఇదంతా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అకుంఠిత దీక్షతో సాధ్యమైంది. అయినా ఆయనపై కక్షతో కల్పతరువు కాళేశ్వరంపై కాంగ్రెస్ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. కాళేశ్వరంలో అంతర్భాగమైన మేడిగడ్డ వద్ద ఒక్క పిల్లర్ కుంగితే మొత్తం ప్రాజెక్టే అక్కెర రాదని అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. అదే నిజమైతే ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎలా ఎత్తిపోశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగానే నిర్మించిన జలాశాయాలు, పంప్‌హౌస్ ద్వారానే కదా ఎత్తిపోసిందనే విషయాన్ని మరిచిపోయారు. కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఎత్తిపోయకుండా బాగా పంట పండిందని చెబుతున్నారు. కానీ, కాలం కరుణించింది కాబట్టే ఇవాళ్ల ఇంత పంట పండిందనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. అసలు కరువు పరిస్థితులు తలెత్తినప్పుడే నీటిని ఎత్తిపోసుకోవాలన్నది కాళేశ్వరం లక్ష్యం కదా! దీనిని పూర్తిగా విస్మరించి మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతోనే మేడిగడ్డను బూచిగా చూపుతున్నారు. ఆ మేడిగడ్డ పిల్లర్‌ను చిన్న మరమ్మతుతో మంచిగా వాడుకోవచ్చని డ్యాం భద్రతకు సంబంధించి దేశంలోనే అత్యున్నత సంస్థ ఎన్డీఎస్ చెబుతున్నా వినిపించుకోవడం లేదు. అలా కాకున్నా ప్రత్యామ్నాయ మార్గాలతోనూ ఎత్తిపోసుకోవచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నా లెక్క చేయడం లేదు. ఫలితంగా ఇయాల చాలా ప్రాజెక్టులు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఏడాది పొడవునా నీళ్లతో కళకళలాడిన శ్రీ రాజరాజేశ్వర జలాశయం ఇప్పుడు వెలవెలబోతున్నా పాలకులకు పట్టడంలేదు.



*2019 జూన్ 21న కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, కన్నెపల్లి డెలివరీ సిస్టర్న్ వద్ద పూజలు చేస్తున్న తొలి ముఖ్యమంత్రి కేసీఆర్*

### మండిపడుతున్న కర్షక లోకం

నాడు ఉమ్మడి రాష్ట్రంలో తీరుగానే నేడు స్వరాష్ట్రంలో సాగుతున్న వివక్షపై రైతులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు ఆది నుంచీ తమపై కక్ష సాధిస్తూనే ఉందని ఆగ్రహిస్తున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న ప్రజాదరణను ఓర్వలేక తమపై సాధిస్తున్నదని వాపోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎదురైన పరిస్థితులే మళ్లీ కనిపిస్తున్నాయని వాపోతున్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ప్రాజెక్టు మొదలు పెట్టినా ఏండ్లపాటు సాగిందని, కొన్ని కొసెల్లకుండానే పోయాయని, కానీ, కేసీఆర్ కృషితో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మూడేళ్ల స్వల్ప కాలంలోనే పూర్తయిందని కొనియాడారు. వానకాలం తర్వాత ఎప్పుడు చూసినా వాగును తలపించే గోదావరి కాళేశ్వరంతో నిండుకుండలా మారిందని, చరిత్రలో ఎవరూ ఊహించని విధంగా పల్లం నుంచి ఎదురెక్కిందని చెబుతున్నారు. ఆయన సంకల్పబలంతోనే కాళేశ్వరం సాగునీటి రంగ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిందని, లక్షలాది ఎకరాలకు నీరందించిందని, వేలాది చెరువులు నిండాయని గుర్తు చేశారు. కానీ, మేడిగడ్డలో కుంగిన పిల్లర్‌ను సాకుగా చూపి ఎండబెట్ట వద్దని, రాజకీయాలు చేయొద్దని హితవు పలుకుతున్నారు. పిల్లర్‌ను చిన్న మరమ్మతుతో వినియోగంలోకి తేవచ్చని, లేదంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఎత్తిపోతలను ఉపయోగించుకోవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. తమపై చిత్తశుద్ధి ఉంటే స్వార్థపూరిత రాజకీయాలు పక్కన పెట్టాలని హితవు పలుకుతున్నారు. ప్రపంచమే కీర్తించిన కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని సూచిస్తున్నారు.

## కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- గొర్రెపల్లిలో జీపీ నూతన భవనం, మొగిలిపేటలో ఓపెన్ జిమ్ ప్రారంభం



*గొర్రెపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల*

మల్లాపూర్, జూన్ 20 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. మల్లాపూర్ మండలంలోని గొర్రెపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ₹20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం, మొగిలిపేటలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు నిధులు ₹5 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ గ్రామాల్లో పుట్టి పెరిగారని, అందుకే గ్రామాల్లోని ప్రజల కష్టాసుఖాలన్నీ ఆయనకు స్పష్టంగా తెలుసన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి పేరిట ప్రతి పల్లెకూ ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధిలో ముందు వరుసలో నిలిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రతి హామీ ప్రజలకు అందేదాకా తాము పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో శశికుమార్, పీఆర్ డీఈ రమణారెడ్డి, ఎంపీవో జగదీశ్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, నాయకులు దేవ మల్లయ్య, గౌరు నాగేశ్, కదుర్క గంగనర్సయ్య, ఓస రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లి సమీపంలోని డీ 64 ప్రధాన కాలువలో మొలిచిన తుంగ, పిచ్చిమొక్కలు



తూముల వద్ద ధ్వంసమైన ప్రధాన కాలువ



*శిథిలమైన 10 ఆర్ మైనర్ తూము*

## కాలువలు ఇలా.. సాగునీరు ఎలా..?

- పిచ్చి మొక్కలతో నిండిపోయిన గొల్లపల్లికి నీరందించే డీ 64 కాలువ
- శిథిలమైన తూములు, మైనర్ కాలువలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

గొల్లపల్లి, జూన్ 20 : గొల్లపల్లి మండలానికి సాగునీరందించే ఎస్సారెస్పీ డిస్ట్రిబ్యూటరీ-64 కాలువతోపాటు తూములు, మైనర్ కాలువలు అధ్వానంగా మారాయి. వేసవిలో ఈ కాలువను శుభ్రం చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. కాలువలు శుభ్రం చేసే పనుల మంజూరు కోసం ఎస్టిమేట్ చేసి ఎంపీడీవో ద్వారా కలెక్టర్‌కు పంపించామని అధికారులు చెబుతున్నారు. అయితే వానకాలం మొదలైందని, వర్షాలు పడుతున్నాయని, ఇప్పుడు ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. కాకతీయ ప్రధాన కాల్వకు జగిత్యాల సమీపంలోని నర్సింగాపూర్ వద్ద ప్రారంభమయ్యే డీ-64 కాలువ, అక్కడి నుంచి 27 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తున్నది. ఒక్క గొల్లపల్లి మండలంలో 12 వేల పైచిలుకు భూమి ఈ కాలువ కింద సాగవుతుంది. ఈ కాలువకు 14 మైనర్ కాలువలు ఉండగా, అవి కూడా శిథిలమై, వాటికి షెటర్లు లేక నీరు వృథాగా పోతున్నది. మరోవైపు రైతులు ఎక్కువ నీటిని వాడుకునేందుకు కాలువలో పెద్దపెద్ద రాళ్లు అడ్డంగా పెట్టి అడ్డ కట్టలు కడుతుంటారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోగా, కనీసం లస్కర్లు సైతం లేక పోవడంతో ఆయకట్టు చివరి రైతులకు కన్నీరే మిగుతున్నది. డీ-64కు డిజైన్ డిశ్చార్జీ ప్రకారం 230 క్యూసెక్కుల నీరు విడుదలైతే ఈ కాల్వ పరిధిలో 14,226 ఎకరాలకు సజావుగా నీరందాలి. కానీ, మైనర్ కాలువల షెటర్లు, తూములకు ఉన్న పైపులు సరిగా లేక నీరు వృథా అవుతున్నది. ఈ సీజన్‌లో ఆయకట్టు చివరి వరకు నీరందాలంటే కాల్వల్లో పేరుకు పోయిన పిచ్చి చెట్లు, చెత్తా చెదారాన్ని జేసీబీల సహాయంతో తీయించి ఆయకట్టు చివరి వరకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



దూలూర్-బొమ్మెన గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కల్వర్టు

## వానొస్తే వణుకే

- ప్రమాదకరంగా లో లెవల్ వంతెనలు
- వర్షాలు పడితే నిలిచిపోతున్న రాకపోకలు

కథలాపూర్, జూన్ 20: కథలాపూర్ మండలంలోని కొన్ని గ్రామాల శివారులో గల లోలెవల్ కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. భారీ వర్షాలు కురిస్తే వాటి పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించి ఏటా రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. ముఖ్యంగా కోరుట్ల-వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం సిరికొండ శివారులో ఆయిల్ ఒర్రె వద్ద, ఇప్పపెల్లి శివారులో ఎల్లమ్మ ఒర్రె వద్ద వరద ఉధృతంగా పారి రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోయిన సందర్భాలున్నాయి. తాండ్ర్యాల శివారులో రెండు వైపులా కల్వర్టుల వద్ద వాగు ఉధృతంగా పారితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అవుతున్నాయి. దూలూర్-బొమ్మెన గ్రామాల మధ్య దూలూర్ శివారు, పెగ్గెర్ల శివారు, ఇప్పపెల్లి-పోతారం గ్రామాల మధ్య, అంబారిపేట-తుర్తి గ్రామాల మధ్య కల్వర్టుల పైనుంచి వరద ప్రవహించి రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయి. అధికారులు త్వరగా హైలెవల్ కల్వర్టులు నిర్మిస్తే ఇబ్బందులు ఉండవని అభిప్రాయపడుతున్నారు.



తాండ్ర్యాల-గంభీర్‌పూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కల్వర్టు